క్లుప్తంగా

అట్టహాసంగా మంత్రి కొల్లు విజయోత్సవ ర్యాలీ



మచిలీపట్నంటౌన్: రాష్ట్ర మంత్రిగా నియమితులైన కొల్లు రవీంద్ర శుక్రవారం రాత్రి నగరంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మూడు స్తంభాల సెంటరు వద్ద ప్రారంభమైన ర్యాలీ నగరంలోని ప్రధాన కూడళ్ల మీదుగా నాగపోతరావుసెంటరులో ఉన్న టీడీపీ కార్యాలయానికి చేరింది. ర్యాలీలో పాల్గొన్న మంత్రి రవీంద్ర ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పలు సెంటర్లలో అభిమానులు, పార్టీ కార్యకర్తలు పూలమాలలు, శాలువాలు, బొకేలతో సత్కరించారు. ఆయన అభిమానులు క్రేన్ల సాయంతో గజమాలలు వేశారు. డీజే సౌండ్స్, బాణసంచా కాలుస్తూ ముందుకు సాగారు. ర్యాలీలో మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ బాబాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో 15వ తేదీ శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎం.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పాత, కొత్త హౌసింగ్ బోర్డు కాలనీ, డ్రైవర్స్ కాలనీ, గుమస్తాల కాలనీ, మాచవరం, దేవునిచెరువు, పెడన బైపాస్, వలందపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గూడూరులో...


గూడూరు: మండల కేంద్రమైన గూడూరులో విద్యుత్ లైన్ల నిర్వహణ చేపడుతుండటంతో శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎం.రాజేష్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

స్టూడెంట్స్ కిట్లు పంపిణీ



ఘంటసాలపాలెం(ఘంటసాల): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని ఘంటసాలపాలెం సీబీసీఎన్‌సీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.సాల్మన్ రాజు అన్నారు. ఘంటసాల మండలం ఘంటసాలపాలెం పంచాయతీ శివారు చాట్రగడ్డవానిగూడెం సీబీసీఎన్‌సీ పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం స్టూడెంట్స్ కిట్లు, పుస్తకాలు, వర్క్‌బుక్స్, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సాల్మన్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పుస్తకాల నుంచి తినే ఆహారం వరకు అన్నీ ఉచితంగా అందిస్తున్నారన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నేర్పిస్తున్నారని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం సాల్మన్ రాజు కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కోనేరుసెంటర్: బందరు మండలం కానూరు గ్రామంలో గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమికి ప్రజలు అందించిన ఘన విజయంతో ప్రభుత్వంపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. కూటమికి అఖండ మెజారిటీని అందజేసిన ప్రతి ఒక్కరికీ కూటమి తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపు వెంకటేశ్వరమ్మ, దివి మహేష్, జి.నరేష్, శాఖమూరి వెంకటేశ్వరమ్మ, పట్టపు మంగతాయారు, ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు.
కుమార్ దుశ్శాలువాలతో సత్కరించారు.

ఏఎంసీ చైర్మన్ పదవికి వేమూరి రాజీనామా

కొడాలి(ఘంటసాల): ఘంటసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి వేమూరి వెంకట్రావు శుక్రవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో ఏఎంసీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.రాజీనామా పత్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శికి సమర్పించారు.

ఉలిక్కిపడ్డ కృత్తివెన్ను

- సీతనపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- తెల్లవారుజామున భారీ శబ్దంతో వాహనాలు ఢీ
- భయంతో పరుగులు తీసిన స్థానికులు
- డివైడర్ లేకపోవడంతో నిత్యకృత్యంగా మారిన ప్రమాదాలు



పోస్టుమార్టం అనంతరం మృతుల బంధువులకు డెత్ సర్టిఫికెట్ అందిస్తున్న కృత్తివెన్ను తహసీల్దార్ సుందర్‌సింగ్

కృత్తివెన్ను: తెల్లవారే సమయంలో... ప్రశాంతంగా ఉండే గ్రామీణ ప్రాంతమైన కృత్తివెన్నులో హఠాత్తుగా రెండు వాహనాలు ఢీకొట్టుకోవడంతో వచ్చిన భారీ శబ్దంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. శుక్రవారం తెల్లవారుజామున కృత్తివెన్ను మండలంలోని సీతనపల్లి వద్ద 216 జాతీయ రహదారిపై పెనుప్రమాదం సంభవించింది. లారీ, మినీవ్యాన్ ఎదురెదురుగా ఢీ కొట్టుకోవడంతో ఆరుగురు వ్యక్తులు మరణించడంతోపాటు మరో ఐదుగురు తీవ్రగాయాలపాలయ్యారు. కృత్తివెన్ను పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం ఉదయం సుమారు 4.30 గంటల సమయంలో సీతనపల్లి పెట్రోల్ బంకు సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో చేపల ప్యాకింగ్ కోసం కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి మినీ వ్యాన్‌లో వస్తున్న ఐదుగురు వ్యక్తులు, పాండిచ్చేరి నుంచి భీమవరం రొయ్యపిల్లల సీడ్ లోడుతో వెళుతున్న లారీ డ్రైవర్ ప్రాణాలు కోల్పోయారు. మినీవ్యాన్‌లో ఉన్న మరో ఐదుగురు వ్యక్తులు తీవ్రగాయాలపాలై మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరణించిన వారిలో రేవు భూషణం (26), గండి ధర్మవరప్రసాద్ (27), పెదశింగు కనకరాజు (34), చింతా లోవరాజు (32), మాగాపు నాగరాజు (30), అయ్యప్పన్ జయరాజన్ (42) ఉన్నారు. మేడిశెట్టి మహేష్, చింతా దుర్గారావు, రేవు జ్ఞానేశ్వరరావు, మల్లాడి శ్రీకాంత్, సంగాని నాగేంద్రబాబు గాయాలపాలై మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

మృతులంతా కూలి పనులు చేసుకునే వారే...

పొట్టకూటి కోసం సుదూర ప్రాంతమైన యానాం, అమలాపురం ప్రాంతాల నుంచి తెల్లవారు జామున సుమారు 2 గంటలకు వారంతా ఇంటి నుంచి బయలు దేరారు. వారందరూ రోజువారీ కూలి పనులు చేసుకునే నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. దాదాపు 100 కిలోమీటర్లు ప్రయాణం చేసిన తరువాత కృత్తివెన్ను సమీపంలో వీరిని రోడ్డు ప్రమాదంలో మృత్యువు కబళించింది. వీరు ప్రయాణిస్తున్న వాహనం ముందు సరుగుపుల్లల లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ను ఢీకొట్టి ఎదురుగా వస్తున్న లారీని బలంగా గుద్దుకోవడంతో ఈ భారీ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో మినీవ్యాన్ డ్రైవర్‌తో పాటు వ్యాన్‌లోని మరో నలుగురు, తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ ప్రాణాలు కోల్పోయారు.

నిత్యకృత్యంగా మారిన ప్రమాదాలు

ఇటీవల నిర్మాణం పూర్తి చేసుకున్న 216 జాతీయ రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యమైపోయాయని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మధ్యలో డివైడర్ లేకపోవడమే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణమని కృత్తివెన్ను ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఆయనతో పాటు జెడ్పీటీసీ మైల రత్నకుమారి సానుభూతి వ్యక్తం చేశారు.

హుటాహుటిన స్పందించిన యంత్రాంగం

ప్రమాదవార్త తెలియగానే అన్ని శాఖల అధికారులు వెంటనే స్పందించారు. కృత్తివెన్ను ఎస్‌ఐ నాగరాజు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో వాహనాలలో ఇరుక్కున్న మృతదేహాలను బయటకు తీయించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా క్లియర్ చేశారు. కృత్తివెన్ను తహసీల్దార్ సుందర్‌సింగ్, ఆర్‌ఐ శివకుమార్, వీఆర్‌వోలతో కలసి మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పోస్టుమార్టం ప్రక్రియను పరిశీలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసి, మృతదేహాలతో పాటు మరణ ధ్రువీకరణ పత్రాలను వారి బంధువులకు అందించినట్లు తహసీల్దార్ తెలిపారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

- పొలం మెరక పనులను అడ్డుకోవడం సమంజసం కాదు
- రైతుల బాగు కోరడం అంటే ఇదేనా?
- ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌పై మాజీ ఎమ్మెల్యే సింహాద్రి విమర్శ



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: ఎన్నికల ఫలితాలు వచ్చి పది రోజులు కూడా కాకముందే ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం శోచనీయమని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 46 వేల అత్యధిక మెజారిటీ మండలి బుద్ధప్రసాద్‌కు ఇచ్చారని చెప్పారు. లంకపల్లిలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ ఇంటి మీదకు వెళ్లి దౌర్జన్యం చేసి తిరిగి ఆయన మీదే కేసు పెట్టారని అన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకుడు సామర్ల రామచంద్రరావు (రాముడు) వీఆర్వో అనుమతి తీసుకుని మెరక వేసిన తన పొలంలో నుంచి మట్టిని తీసి పక్కనే ఉన్న తన పొలంలోకి తీసుకెళ్లి చదును చేస్తుంటే తహసీల్దార్‌ని అడ్డుపెట్టి అడ్డుకోవడం ఎంతవరకూ న్యాయమన్నారు. తహసీల్దార్ దగ్గరకు వెళ్లి తన దగ్గర ఉన్న వీఆర్వో అనుమతి పత్రం చూపిస్తే దానిని ఆయన లాక్కున్నారని చెప్పారు. పోలీసులను ఎందుకు పంపించారంటే తాను పంపలేదని చెప్పారని, డీఎస్పీని అడిగితే తమ దృష్టికి తీసుకురాలేదన్నారని, ఇదంతా వెనుకుండి ఎవరు చేయిస్తున్నారో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రైతులంతా బాగుండాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆయన తనయుడు పంట కాలువల వెంట తిరిగి నీతులు చెప్పడం సంతోషమేనని, అయితే పొలం పనులు చేసుకుంటున్న రైతుపై ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం ఎందుకో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉల్లిపాలెంలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన పోస్టులు కనబడలేదా అని సింహాద్రి ప్రశ్నించారు. ప్రజలు ఇచ్చిన తీర్పుని సద్వినియోగం చేసుకుని జనానికి ఉపయోగ పడే పనులు చేయాలని బుద్ధప్రసాద్‌కు హితవు పలికారు. సమావేశంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, రైతు విభాగం నాయకుడు సామర్ల రామచంద్రరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజుల జైగోపాల్, యూత్‌నాయకుడు చింతలపూడి బాలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నిర్భయానంద స్వామి ద్వితీయ ఆరాధన

ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



నిర్భయానంద స్వామి ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

చల్లపల్లి(అవనిగడ్డ): మండల పరిధిలోని పాగోలుకై వల్యాశ్రమ చలాచల బోధోపదేశ గురుస్థాన మందిర వ్యవస్థాపకుడు నిర్భయానంద స్వామి ద్వితీయ ఆరాధన కార్యక్రమం శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురుస్థానంలో ప్రతిష్ఠించిన శివలింగానికి రుద్రాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆరాధన కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. మందిరంలోని దేవతా మూర్తులను, సహస్ర లింగాలను సందర్శించారు. శ్రీచక్రం ఆకారంలో నిర్మితమవుతున్న నూతన ఆలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మేకా బంగారు బాబు, చాపరాల గాంధీప్రసాద్, సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, శ్రీశైలం సేవాశ్రమం ప్రతినిధి కె.శ్రీనివాసమూర్తితో పాటు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బీ పెండింగ్ పనులన్నీ వెంటనే పూర్తి చేయాలి

అధికారులతో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సమీక్ష



ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: నియోజకవర్గంలో ఆర్ అండ్ బీ శాఖలో పెండింగ్‌లో ఉన్న రహదారి పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆర్‌అండ్‌బీ అధికారులతో బుద్ధప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ముందు ప్రారంభించి నిలిచిపోయిన అవనిగడ్డ - కోడూరు రహదారి పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బీ డీఈ వరలక్ష్మిని ఆదేశించారు. టి కొత్తపాలెం - గుల్లలమోద రహదారి పనులు ప్రారంభించాలని, అవనిగడ్డ - అశ్వారావుపాలెం రోడ్డుకి మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా డీఈ వరలక్ష్మి మాట్లాడుతూ కోడూరు రహదారి పనులు పునఃప్రారంభిస్తామని, గుల్లలమోద రహదారి పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే ప్రారంభిస్తామని, రూ.40 లక్షలతో అశ్వారావుపాలెం రహదారికి మరమ్మతులు చేపడతామని చెప్పారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఏఈలు పాల్గొన్నారు.

బెట్టింగ్ రాయుడి అరెస్ట్

గుడివాడరూరల్: క్రికెట్ బెట్టింగ్ రాయుడిని గుడివాడ టూటౌన్ పోలీసులు గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. పట్టణంలోని బంగారపు షాపుల బజారులో ఉన్న శ్రీలక్ష్మీదుర్గ జ్యూయలరీ షాప్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు టూటౌన్ సీఐ ఎంవీ దుర్గారావు సిబ్బందితో కలసి షాపులో దాడులు నిర్వహించారు. షాపు యజమాని కూనసాని వినోద్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా కొంతకాలంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది. శుక్రవారం బంగ్లాదేశ్-నెదర్లాండ్ దేశాల మధ్య జరిగిన టీ-20 వరల్డ్‌కప్ మ్యాచ్‌కు సంబంధించి బెట్టింగ్‌లు చేస్తున్నట్లు విచారణలో తేలడంతో వినోద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సీఐ ఎంవీ దుర్గారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ తెలిపారు.

ఎమ్మెల్యే కాగితను కలిసిన మున్సిపల్ ఉద్యోగులు



పెడన: పెడన ఎమ్మెల్యేగా గెలుపొందిన కాగిత కృష్ణప్రసాద్‌ను పెడన పురపాలక సంఘ ఉద్యోగులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య, టీపీవో ఏసుబాబు, సీనియర్ అసిస్టెంట్ సుందరం, ఆయా విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది ఉన్నారు.

- మండలంలోని వ్యవసాయశాఖకు చెందిన వీఏఏలు, ఎంపీఈవోలు కూడా ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు.

మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్వాడీలకు పంపండి



గూడూరు: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని మల్లవోలు సెక్టారు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జన్ను రేవతి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ బాటలో భాగంగా శుక్రవారం మండలంలోని ఆకుమర్రు పంచాయతీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారం అందిస్తూ ఆటపాటలతో కూడిన విద్యాబోధన జరుగుతుందన్నారు. తద్వారా విద్యార్థులలో శారీరకంగాను, మానసికంగాను చక్కటి ఎదుగుదల కనిపిస్తుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పి.నిర్మల, వి.లక్ష్మీకుమారి, కె.మమత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాహబ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ కన్వీనర్‌లు డి.సూర్యచంద్రరావు, జి.కిరణ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లో టీఎల్‌పీ అండ్ ప్రభావతి గార్డెన్స్‌లో ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

మచిలీపట్నంటౌన్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం నగరంలో నిర్వహించారు. స్థానిక రాంజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో విజయలక్ష్మి మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ టి.నాగరాజు, జిల్లా చైల్డ్ రైట్స్ యూనిట్ ప్రతినిధి కిషోర్, సూపర్‌వైజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రంగనాయకుని బ్రహ్మోత్సవాలు

- రంగులతో ముస్తాబైన ఆలయం
- రంగురంగుల విద్యుత్ దీపాలు
- ముమ్మరంగా ఏర్పాట్లు



ఆలయంలో వేంచేసియున్న శ్రీ రంగనాయకస్వామి

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో ఉన్న శ్రీ భూ నీలా పరివార సమేత శ్రీ రంగనాయకస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక కోనేరుసెంటర్ సమీపంలో ఉన్న ఈ ఆలయం ఎంతో ప్రాచీనమైనది. బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి 22వ తేదీ శనివారం వరకు వైభవోపేతంగా నిర్వహించేందుకు దేవదాయ, ధర్మదాయ శాఖ ఏర్పాటు చేసింది. 16వ తేదీ ఉదయం నుంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, దీక్షా స్వీకరణ, మృత్సంగ్రహణం, అంకురార్పణ, వాస్తుపూజా హోమం, అగ్ని ప్రతిష్ఠాపన, ప్రధాన హోమాలు నిర్వహించనున్నారు. రాత్రికి స్వామి వారిని పెండ్లి కుమారునిగా చేయనున్నారు. 17వ తేదీన ఉదయం ధ్వజారోహణ, రాత్రికి జగజ్జ్యోతి, 18వ తేదీన ఉదయం నిత్యబలిహరణ, వధూవరాన్వేషణము, 19న శ్రీదేవి, భూదేవి సమేత రంగనాయకస్వామి వారి కల్యాణ మహోత్సవం, 20న విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై స్వామివారి రథోత్సవం, రథం ముందు భాగాన బేతాళ నృత్య ప్రదర్శనలు, తీన్‌మార్ డప్పులు, మురళీ కోలాటం, సన్నాయిమేళం, బాణసంచా వంటివి ఏర్పాటు చేయనున్నారు. 21, 22 తేదీల్లో స్వామివారికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 24వ తేదీ సోమవారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో స్వామివారి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు.

రెండు శతాబ్దాల చరిత గల ఆలయం

రంగనాయకస్వామి దేవస్థానాన్ని 200 సంవత్సరాలకు పూర్వం బొమ్మదేవర జమీందారులు నిర్మించినట్లుగా చరిత్ర తెలుపుతోంది. బందరులో కొంత మేర భూమిని వెచ్చా వారు (వైశ్యులు) దానం చేశారని పూర్వీకులు చెబుతుంటారు. రాబర్ట్‌సన్ అనే తెల్లదొర కృష్ణాజిల్లా కలెక్టర్‌గా పనిచేసినప్పుడు దేవస్థాన అభివృద్ధికి కృషి చేశారు. దేవస్థానంలో వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం నిత్యపూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాయకస్వామి వారు ఆలయంలో కొలువై భక్తులనుంచి పూజలందుకుంటున్నారు. ధనుర్మాసంలో ముక్కోటి ఏకాదశి, అధ్యయనోత్సవాలు, గోదా కల్యాణాలకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటారు. ఆలయంలో శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ గరుత్మంతుని ఉప ఆలయాలు ఉన్నాయి. స్వామివారి కల్యాణ మండపం, మూడంతస్తుల రాజగోపురం ఉంది. విశాలమైన ఆవరణలో దేవాలయం భక్తులను ఎంతో ఆకట్టుకుంటోంది. జ్యేష్ఠ మాసంలో వార్షిక బ్రహ్మోత్సవాలు, జ్యేష్ఠ శుద్ధ దశమి మొదలు బహుళ తదియ వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఇదే కాక ఉగాది, శ్రీరామనవమి, తొలి ఏకాదశి, దసరా నవరాత్రులు, కార్తిక మాసం తదితర పండుగలను ఆలయంలో నిర్వహిస్తారు. ఆలయానికి దుకాణ సముదాయం ద్వారా ఆదాయం సమకూరుతోంది.

ఏర్పాట్లు పూర్తి చేశాం



ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు ఆలయంలో నిర్వహించే స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాం. భక్తులకు తీర్థ ప్రసాదాలు, తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేశాం. ఉత్సవాల ముగింపు అనంతరం 24వ తేదీన సోమవారం నిర్వహించే అన్నసమారాధన కార్యక్రమానికి భక్తులు తరలిరావాలి.

– కందుల వేణుగోపాలరావు, ఆలయ ఈఓ

మహిళా సాధికారతే ధ్యేయంగా ఉచిత శిక్షణ



ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ప్రసాదరావు తదితరులు

పెడన: సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెడన పట్టణంలో నిరుపేదలైన మహిళలకు కుట్టుమిషన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, శారీ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని సహాయ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు మామిడి ప్రసాదరావు తెలిపారు. పెడనలోని గూడూరు రోడ్డులో బీజీకే జెడ్పీహెచ్‌ఎస్ ఎదురుగా ఉన్న శివార్జున నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో ఉచిత శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన సహాయ ఫౌండేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు కోన వెంకటేశ్వరమ్మతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ మంచిగా శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందడమే కాక మహిళా పారిశ్రామిక వేత్తలుగా రూపొందాలని ఆకాంక్షించారు. సహాయ ఫౌండేషన్ ద్వారా నిర్వహించే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు పేదల జీవితాలలో వెలుగులు నింపటమే కాక సమాజంలో ప్రత్యేక గౌరవ స్థానం తీసుకువస్తాయని సహాయ ఫౌండేషన్ విద్యా విభాగం చైర్మన్ మట్టా రాధాకృష్ణమూర్తి అన్నారు. కుట్టు శిక్షణ –ఫ్యాషన్ డిజైనింగ్‌కు పిచ్చుక దేవి నాగమణి, మగ్గం వర్క్ – శారీ పెయింటింగ్‌కు రామినేని దుర్గా నారాయణమ్మ ట్రెయినర్లుగా ఉంటారని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్ బాషా వివరించారు. సహాయ ఫౌండేషన్ ద్వారా పెడన పట్టణంలోనే కాక అతి త్వరలో జిల్లా ముఖ్యకేంద్రమైన మచిలీపట్నంలో కూడా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. శిక్షణ పొందిన మహిళలకు బ్యాంక్‌ల ద్వారా రుణ సదుపాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాగిత శంకర సాంబశివరావు, బడుగు ఉమాదేవి, అల్లాడ శ్యామలత, భట్ట దుర్గా శంకర్, నందం నాని, కంప్యూటర్ ట్రైనర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల యూనియన్‌కు రూ.1.05 లక్షల విరాళం



యూనియన్ సభ్యులకు నగదు చెక్కును అందిస్తున్న శ్రీనివాసరావు

కోడూరు: మండల పాస్టర్ల యూనియన్‌కు టీఎస్సార్ గ్రూప్ అధినేత, సినీ నిర్మాత తిరుపతి శ్రీనివాసరావు అండగా నిలిచారు. యర్రారెడ్డిపాలెంలోని హోసన్నా గాస్పెల్ చర్చిలో శుక్రవారం పాస్టర్ల యూనియన్ సభ్యులకు రూ.1.05లక్షల నగదు చెక్కును శ్రీనివాసరావు విరాళంగా అందించారు. వాక్యోపదేశకులకు ఎటువంటి సమస్యలు వచ్చినా తాను అండగా ఉంటానని శ్రీనివాసరావు భరోసా కల్పించారు. నియోజకవర్గంలోని మిలిగిన ఐదు మండలాల పాస్టర్లు కూడా తమ మండలాల వారీగా యూనియన్లు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. యూనియన్‌గా ఏర్పడిన మండలాలకు రూ.లక్ష చొప్పున సహాయం అందిస్తానని శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఇటీవల గాయపడిన పాస్టర్ క్రీస్తుదాసుకు రూ.10వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న మరో పాస్టరు సంసోనుకు మందుల ఖర్చు నిమిత్తం మరో రూ.10వేల నగదును అందించారు. అనంతరం పాస్టర్ యూనియన్ సభ్యులు శ్రీనివాసరావును దుశ్శాలువాలతో సత్కరించారు.

ఇస్లామిక్ హెల్పర్స్ టీం ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

చల్లపల్లి(అవనిగడ్డ): స్థానిక నారాయణరావునగర్ గౌసియా మసీదు ఆవరణలో ఇస్లామిక్ హెల్పర్స్ టీం ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం జరిగింది. పెద్ద ఎత్తున యువకులు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాల బ్లడ్‌బ్యాంకు వైద్య సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఇస్లామిక్ హెల్పర్స్ టీం ప్రతినిధులు షేక్ అబూ తాలీబ్, అబ్దుల్ అర్షద్, అబ్దుల్ రౌఫ్, షేక్ బాజీతో పాటు పలువురు యువకులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, మసీదు కమిటీ అధ్యక్షుడు షరీఫ్, ముస్లిం పెద్ద షేక్ నసీంఘోరీ పాల్గొన్నారు.